క్లుప్తంగా

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి


తరగతులు నిర్వహిస్తున్న కళాశాల

జగిత్యాల: ప్రభుత్వ సెలవు రోజు పాఠశాల నిర్వహించిన కార్పొరేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.పట్టణంలోని చైతన్య పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా కొనసాగించడంతో వారు పాఠశాలను సందర్శించి బంద్ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని, కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రేవంత్ పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి భారీ బందోబస్తు


నిమజ్జన స్థలం పరిశీలిస్తున్న డీఎస్పీ

కోరుట్ల: పట్టణంలో శనివారం నిర్వహించే గణేశ్ నిమజ్జనానికి భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు అన్నారు. పట్టణ శివారులోని పెద్ద వాగు వద్ద గణేశ్ నిమజ్జన స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. శోభాయాత్రలో, నిమజ్జన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సైలు, పోలీస్ సిబ్బంది,అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ సురేష్ బాబు, ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో యాదవులకు టికెట్లు ఇచ్చిన పార్టీకే మద్దతు


మాట్లాడుతున్న మహేశ్

కథలాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు ఎక్కువ టికెట్లు ఇచ్చిన పార్టీకే మద్దతు ఇస్తామని యాదవ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుంభం మహేశ్ అన్నారు. శుక్రవారం కథలాపూర్‌లో సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. జిల్లాలో యాదవుల జనాభా అధికంగా ఉందని, అందుకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ టికెట్లు అధికంగా ఇవ్వాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అసెంబ్లీలో ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల యాదవసంఘం అధ్యక్షుడు మ్యాదరవేని ఆశన్న, ప్రధానకార్యదర్శి రవియాదవ్, నాయకులు పాల్గొన్నారు.

భూషణరావుపేటలో ఉచిత నేత్ర వైద్యశిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 85 మందికి కంటి పరీక్షలు చేయగా... 46 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, నాగం భూమయ్య,తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన యువకుడు

మల్లాపూర్: ఆపదలో ఉన్న మహిళలకు రక్తదానం చేసి ప్రాణాలను కాపాడి యువతకు స్ఫూర్తిగా నిలిచాడు పెనుకుల నరేశ్ . పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలానికి చెందిన ఓ మహిళ తీవ్ర రక్తహీనతతో ప్రాణపాయ స్థితిలో చికిత్స కోసం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా, ఆమెకు వెంటనే ఓ పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు సూచించారు. వెంకట్రావ్‌పేటకి చెందిన పెనుకుల నరేశ్ అనే యువకుడు స్పందించి శుక్రవారం జగిత్యాలకు వెళ్లి రక్తదానం చేశారు.


చిన్నమెట్‌పల్లిలో కోలాటం ఆడుతున్న భక్తులు


రాయికల్‌లో వినాయకుని శోభాయాత్రలో మహిళలు


నిమజ్జనానికి తరలుతున్న దుబ్బరాజన్న వినాయకుడు


జగిత్యాలలో అలరించిన చిన్నారుల వేషధారణ

వినాయకా.. వీడ్కోలిక ..

జగిత్యాలరూరల్/జగిత్యాలజోన్/ధర్మపురి/పెగడపల్లి/మల్లాపూర్/సారంగాపూర్/కోరుట్ల రూరల్/మల్యాల: గణపతి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణనాథులు నిమజ్జనానికి తరలాయి. వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేసి, చెరువులు, కుంటలు,వాగులు, వరదకాలువ, ఎస్సారెస్పీ కాలువల్లో నిమజ్జనం చేశారు.మేళతాలాలు, డప్పుచప్పుళ్లు, బాజా బజంత్రీల మధ్య జై బోలో గణేశ్ మహారాజ్‌కీ జైజై అంటూ కేరింతలు కొడుతూ ఆనందోత్సాహాలతో ఊరేగింపు కొనసాగింది. యువకులు, యువతులు, మహిళలు కోలాటాలు ఆడుతూ, చిన్నారులు నృత్యాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామాలన్నీ కాషాయవర్ణం, శోభాయాత్రతో సందడిగా మారాయి. పలు చోట్ల అన్నదానాలు, ప్రత్యేక పూజలు చేశారు. కోరుట్ల రూరల్: పట్టణంతో పాటు మండలంలోని చిన్నమెట్‌పల్లిలో పలు వినాయక విగ్రహాలను శుక్రవారం నిమజ్జనం చేశారు.చిన్నమెట్‌పల్లిలో గణనాథున్ని కోలాటంతో తీసుకవెళ్లి గ్రామ శివారులోని వాగులో నిజ్జనం చేశారు.రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో శుక్రవారం యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథులకు వీడ్కోలు పలికారు. పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు.


జగిత్యాలలో కోలాటం ఆడుతున్న మహిళలు


కోరుట్లలో గుస్సాడి నృత్యాల మధ్య నిమజ్జనం


కలిగోటలో భక్తుల పూజలు


దుబాయిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


పెగడపల్లిలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు


ధర్మపురిలో హారతులు ఇస్తున్న మహిళలు

గణనాథునికి 108 ప్రసాదాల నైవేద్యం


కోరుట్లలో 108 ప్రసాదాలతో స్వామివారికి నైవేద్యం

కోరుట్ల: పట్టణంలోని శ్రీ అష్ట లక్ష్మీ సహిత శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయకునికి భక్తులు శుక్రవారం 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు.

చిట్టాపూర్ ఫ్రెండ్స్ స్టార్ యూత్ గణేశ్ మండపానికి అవార్డు

మల్లాపూర్: మండలంలోని చిట్టాపూర్ ఫ్రెండ్స్ స్టార్ యూత్ గణేశ్ మండపం ప్రథమ బహుమతి(అవార్డు)కి ఎంపికైంది. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విధంగా ఏర్పాటు చేసిన మండపాలకు ప్రోత్సహించే విధంగా ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ పుల్ల శ్రీనివాస్‌గౌడ్ నియోజకవర్గస్థాయిలో అవార్డులు అందించారు.

కథలాపూర్: కథలాపూర్ మండలంలోని గ్రామాల్లో శుక్రవారం వినాయకుడి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, అన్నదానాలు చేశారు.


అవార్డు అందుకుంటున్న మంపడ నిర్వాహకుడు

వినాయకుని లడ్డూ వేలం

రాయికల్: పట్టణంలోని సంఘమిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని లడ్డూను శుక్రవారం వేలం పాట నిర్వహించారు. పడగల కిషోర్ రెడ్డి రూ.29,100 లడ్డూను దక్కించుకున్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


మోదీ, నిర్మలాసీతారామన్, ఎంపీ అర్వింద్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కోరుట్ల/ధర్మపురి/రాయికల్/మల్యాల/మల్లాపూర్/వెల్గటూర్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం పట్ల శుక్రవారం హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కోరుట్ల,ధర్మపురి, రాయికల్, మల్యాల, మల్లాపూర్, వెల్గటూర్‌లో క్షీరాభిషేకం చేశారు. దేశంలోని సాధారణ ప్రజలకు ప్రయోజనం కలిగించేలా జీఎస్టీ సంస్కరణలు చేపట్టడం సంతోషకరమని వక్తలు అన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


రాయికల్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కొండగట్టు వాసికి అమ్మ ఆదర్శ పాఠశాల ఉత్తమ చైర్‌పర్సన్ అవార్డు

మల్యాల: మల్యాల మండలం ముత్యంపేట కొండగట్టుకు చెందిన అంజలి ఉత్తమ అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్‌గా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. మల్యాల మండల ఉషోదయ కమిటీ చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌గా అంజలి విశేష సేవలు అందించి, సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడంపై జిల్లా డీఆర్డీఏ పీడీ రఘువరన్, ఐకేపీ ఏపీఎం దేవరాజ్, మల్యాల ఉషోదయ మండల సమాఖ్య సభ్యులు, అంజలికి శుభాకాంక్షలు తెలిపారు.

వినాయక నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

మెట్‌పల్లి: పట్టణంలో శనివారం జరిగే వినాయక నిమజ్జనోత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విగ్రహాలను నిమజ్జనం జరిపే శివారులోని వట్టివాగు వద్ద పనులను శుక్రవారం సీఐ అనిల్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్, కమిషనర్ మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఎక్కడ సమస్య తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకరావాలన్నారు.

రాష్ట్ర ప్రజలపై గణనాథుడి ఆశీస్సులుండాలి


మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

గొల్లపల్లి/పెగడపల్లి/వెల్గటూర్: మహాగణనాథుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గొల్లపల్లి పెగడపల్లి, వెల్గటూర్‌లో పర్యటించి, గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ రాములు గౌడ్, వైస్ చైర్మన్ సత్తిరెడి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నేడు కోరుట్లలో వినాయక నిమజ్జనం

కోరుట్ల: కోరుట్ల వినాయక నిమజ్జనోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌గౌడ్ తెలిపారు. నిమజ్జనోత్సవంలో పాల్గొనదలచిన వినాయక మండపాల వారు శనివారం సాయంత్రం 4 నుంచి 6 గంటలలోపు జూనియర్ కళాశాల మైదానం చేరుకోవాలన్నారు. ఈ లోపు కళాశాల మైదానానికి చేరుకున్న మండపాల వారికి మాత్రమే బహుమతి ప్రదానానికి అర్హత ఉంటుందన్నారు. నిమజ్జనోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కోరుట్ల రూరల్: ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శనివారం కోరుట్ల పట్టణంలో పర్యటించనున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని కార్గిల్ చౌరస్తాలో బ్రాహ్మణ సంఘ వినాయక పల్లకీ సేవలో పాల్గొంటారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో జరిగే వినాయక విగ్రహాల అలంకరణ బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

అధ్యాపకులకు అవార్డులు

జగిత్యాల: ఎస్‌కేఎన్ఆర్ కళాశాలలో జంతుశాస్త్ర విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న రాజు, మహిళ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగంలో పనిచేస్తున్న నీలి వాసవిని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకులుగా ఎంపిక చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ సెక్రటరి యోగితరుణ, కమిషనర్ దేవసేన, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ అశోక్, రామకృష్ణ అభినందనలు తెలిపారు.

శ్రీవేంకటేశ్వరస్వామికి మహాభిషేకం


మహాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మల్యాల: మండలంలోని లంబాడిపల్లిలో శ్రీపద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి మహాభిషేకం , స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు వికాస్ శుక్లా, విజయ్ సముద్రాల, ఆలయ వ్యవస్థాపకులు మరాటి సత్తయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



కోరుట్ల, రాయికల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

జగిత్యాలజోన్/కోరుట్ల/కోరుట్ల రూరల్/కథలాపూర్/రాయికల్: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. కోరుట్ల పట్టణంలోని బ్రహ్మ కుమారీస్ విశ్వ కల్యాణి భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా కేంద్రంలో ముద్దు రామక్రిష్ణయ్య మెమోరియల్ సేవా సదన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కథలాపూర్ మండలం సిరికొండ, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేది గురువులేనని రాయికల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

రాయికల్: పట్టణంలోని మూడో వార్డులో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఎంపీ ధర్మపురి అరవింద్ మూడు లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి శుక్రవారం ప్రొసిడింగ్ కాపీని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, భూమేశ్, రాము, విట్టల్, గణేష్ ,మాధవ్ పాల్గొన్నారు



కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామశివారులో ఎస్సారెస్పీ వరదకాలువలో నీరు ఉధృతంగా పారుతుండగా... కాలువ ఒడ్డు కొద్దిగా కోతకు గురైంది. నీటి ఉధృతి పెరిగితే కాలువకు గండి పడే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు. అధికారులు చొరవ చూపి కాలువ ఒడ్డు కోతకు గురైన చోట త్వరగా మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
పృథ్వీరాజ్,ఏఈ, ఎస్సారెస్పీ,వరదకాలువ కథలాపూర్ సెల్ నంబర్: 6303565931

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643